www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 16 జులై 2024

5

తూర్పుగోదావరి



పిడింగొయ్యి పంచాయతీలో కలెక్టర్ తనిఖీలు

రాజమహేంద్రవరం రూరల్ : పిడింగొయ్యి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు పంచాయతీల్లో పారిశుధ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించే దిశలో శనివారం జిల్లా వ్యాప్తంగా డ్రై డే నిర్వహించామన్నారు ఇందులో భాగంగా అన్ని మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచామన్నారు. పంచాయతీ పన్నుల వసూళ్ల కోసం చర్యలు వేగవంతం చేయాలన్నారు. పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలో 11 వాటర్ ట్యాంకులు ఉన్నాయని వాటిని శుభ్రపరిచామని పంచాయతీ సెక్రెటరీ ఎం.రూప్‌చంద్ తెలిపారు. పన్ను వసూళ్ల వసూళ్లకు సంబంధించి రూ.2.15 కోట్లు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.75 లక్షలు వసూలు చేశామన్నారు.

అభివృద్ధికి దూరంగా గిరిజన గ్రామాలు

- 56 గ్రామాలను గాలికొదిలేసిన ప్రభుత్వాలు
- షెడ్యూల్ గ్రామాలుగా గుర్తింపునకు నోచని వైనం
- కూటమి ప్రభుత్వంపై ఆదివాసీల ఆశలు



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో 16 గ్రామాలు, రౌతులపూడి మండలంలో 20, ప్రత్తిపాడు మండలంలో 20 గిరిజన గ్రామాలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 35 వేల మంది గిరిజన జనాభా నివసిస్తున్నారు. ఈ గ్రామాల ప్రజలు అనేకేళ్లుగా సమస్యలతో సహవాసం చేస్తున్నారు.56 సబ్ ప్లాన్ గ్రామాలను ఐటిడీఏలో విలీనం చేయాలని గిరిజనులు కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గత ప్రభుత్వాలకు గిరిజనులు సమస్యలపై పలు దఫాలుగా విన్నవించినా కనీసం స్పందన లేదు. షెడ్యూల్ గ్రామాలుగా గుర్తింపునకు కృషి చేయాలని గత వైసిపి ప్రభుత్వానికి సైతం మొరపెట్టుకున్నా, ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు వినతులు ఇచ్చినా పట్టలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, పర్యావరణం, అడవులు, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రిగా ఉన్న కొణిదెల పవన్‌కళ్యాణ్ తమ గోడును పట్టించుకోవాలని ఆదివాసీలు ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు.

పెదమల్లాపురం కేంద్రంగా మండలం చేయాలి

శంఖవరం మండలంలో ఉన్న పెద్ద మల్లాపురం గ్రామ పెద్ద పంచాయతీగా ఉంది. ఇక్కడ సుమారు 2 వేలు మందిపైనే గిరిజన జనాభా నివసిస్తున్నారు. అయితే అన్ని గ్రామాలను కలుపుతూ ఈ గ్రామాన్ని మండల కేంద్రంగా చేయాలని అనేకేళ్లుగా గిరిజనులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. నాన్ షెడ్యూల్‌లో ఉన్న ఈ మండలాల్లోని గిరిజన గ్రామాల్లో అంతా షెడ్యూల్ తెగలకు చెందిన వారే జీవనం సాగిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ల దాటుతున్నా అభివృద్ధి, మౌలిక సదుపాయాలు లేక అవస్థలు తప్పడం లేదు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదు.

అక్రమాలెన్నో...

ఈ ప్రాంతాల్లో భూములపై గిరిజనులకు హక్కులు ఉండడం లేదు. కబ్జాలకు గురవుతున్నాయి. అక్రమంగా మైనింగ్ లు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై అధికార యంత్రాంగం ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. భారీగా భూముల ఆక్రమణలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు అంతులేకుండా పోయింది. నిబంధనలకు విరుద్ధంగా భూముల ఆక్రమణలు, కొనుగోళ్లు జరుగుతున్నాయి. అనేక ఉద్యమాల నేపథ్యంలో గతంలో గ్రామాలను ఐటిడిఏ పరిధిలో చేర్చడానికి ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించాలని అధికారులను కోరింది. 2021జనవరిలో పెద్ద మల్లాపురంలో గ్రామ సభలు నిర్వహించకుండా, స్థానికుల అభిప్రాయాలు తీసుకోకుండా వైసిపి ముఖ్య నేతల ఒత్తిళ్ల నడుమ తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు తప్పుడు తీర్మానాలు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలంటూ నిరసనలు చేపట్టారు. ఇందులో భాగంగా సచివాలయం సిబ్బందిని నిర్బంధించారు.

అసౌకర్యాల నడుమ

ఈ గ్రామాల్లో గిరిజనుల హక్కులు కాలరాయబడుతున్నాయి. కనీస సౌకర్యాలకు నిధులు విడుదల కాని పరిస్థితి ఏర్పడింది. విద్యుత్,రోడ్లు లేవు. కనీసం ఒక్క గ్రామానికి సైతం బస్సు సౌకర్యం లేదు. పాఠశాలల్లో మౌలిక వసతులు అస్సలు కనిపించవు. విద్యుత్ సౌకర్యం వున్నా లో-ఓల్టేజీ సమస్యలు ఎక్కువ. అడవుల రక్షణ కనుమరుగైంది. పర్యవేక్షణ చేసే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

పాలకుల నిర్లక్ష్యం తగదు



మా గ్రామాల్లో ఎన్నో ఏళ్ల నుంచి సదుపాయాలు లేక అనేక ఇబ్బందులను పడుతున్న పాలకులు గానీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. కనీసం రోడ్లు, డ్రైన్లు లేవు. తాగునీటి సదుపాయం సక్రమంగా ఉండడం లేదు. రోగాల పాలవుతున్నాం. కరెంటు సమస్యలు చెప్పనక్కర్లేదు.

- చడ్డా వెంకయ్యమ్మ, దండిసీమ, రౌతులపూడి మండలం

అనేక ఉద్యమాలు చేశాం



1950 నుంచి ఉద్యమాలు సాగుతున్నాయి. ఐటీడీఏలో కలపాలని అన్ని రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నాయి. సిపిఎం, గిరిజన ఐక్య సాధన సమితి ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు జరిగాయి. ఐటిడిఏ అధికారులతో సహ కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాం. కొత్త ప్రభుత్వం స్పందించి ఈ మేరకు చర్యలు తీసుకోవాలి.

- బూసరి బాలరాజు,గిరిజన హక్కుల సాధన సంఘం జిల్లా కార్యదర్శి

సమస్యలు పరిష్కరించాలి



ఏళ్ళ తరబడి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. మౌలిక సదుపాయాలు లేక తీవ్ర స్థాయిలో సమస్యలను ఎదుర్కొంటున్నారు. రోడ్లు డ్రైన్లు విద్యుత్తు వంటి కీలక సౌకర్యాలు పాలకుల నిర్లక్ష్యం కారణంగా లేకుండా పోయాయి. పర్యావరణం, అడవుల శాఖ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ ఈ సమస్యపై దృష్టిని పెట్టాలి.

- ఎం.రాజశేఖర్, సిపిఎం జిల్లా కన్వీనర్, కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

స్త్రీ సంక్షేమం, భద్రతపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్త్రీ సంక్షేమం, భద్రత, భరోసా, బాలిక విద్యపై ప్రతి రోజూ దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. వర్చువల్ ద్వారా ఐసిడిఎస్ కేంద్రాల నిర్వహణ, పనితీరును ప్రత్యక్షంగా పర్యవేక్షణ సమీక్ష చేస్తానని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో స్త్రీ శిశుసంక్షేమ శాఖ సిడిపిఒలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ పరంగా స్త్రీ శిశు సంక్షేమం, ఆరోగ్య పరంగా, బాలిక విద్యా, గర్భిణీ లకి ఖచ్చితమైన ఆరోగ్య సంరక్షణ వంటి వాటిపై ప్రత్యక్ష పర్యవేక్షణ కలిగి ఉండాలన్నారు. బాలికలు, మహిళల సంరక్షణ కోసం ఏ వారం ఏ కార్యక్రమం చేయాలో ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారల్లో రక్తహీనత, బలహీనతకు కారణాలు కనుగొని చర్యలు తీసుకోవాలన్నారు. బ్యానర్లు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయకుమారి, జిల్లా పిల్లల సంరక్షణా అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ వైద్య సేవలతో మెరుగైన వైద్యం

ప్రజాశక్తి- కడియం



ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని, మాతశిశు మరణాలు తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కడియం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శివశంకర్ తెలిపారు. సోమవారం కడియం ప్రభుత్వాసుపత్రిలో జెఎస్‌ఎస్‌కె పథకం, ఎన్‌టిఆర్ వైద్య సేవ పథకం ద్వారా ఆసుపత్రిలో చేరి వైద్యం పొందుతున్న రోగులకు ఉచిత ఆహారం పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణి నుంచి బిడ్డకు టీకాలు పూర్తయ్యే వరకూ ప్రభుత్వం పలు పథకాలను అందిస్తూ అండగా నిలుస్తుందన్నారు. ఆసుపత్రికి వచ్చిన వారికి రూ.1 కూడా ఖర్చులేకుండా వైద్యం పొందొచ్చన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షత ప్రసవాల కోసం జననీ శిశు సురక్ష పథకాన్ని కొనసాగిస్తున్నారన్నారు. అలాగే రోగులకు నాణ్యమైన ఉచిత భోజనం కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి కలిదిండి విశాలాక్షి, ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని, డాక్టర్ మోహన్ వంశీ, డాక్టర్ స్వప్న, డాక్టర్ తరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

'శ్రేష్ట'లో గురుకుల విద్యార్థినుల సత్తా

ప్రజాశక్తి - గోపాలపురం

శ్రేష్ట ప్రవేశ పరీక్షలో గోపాలపురం బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినిలు సత్తా చాటి ఇంటర్నేషనల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్‌లో సీట్లు సాధించారని ప్రిన్సిపల్ టి.ఉమాదేవి సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 44 మంది ఈ పరీక్షను రాశారని, వీరిలో ఐదుగురు మొదటి విడత కౌన్సిలింగ్‌లో ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో, డిల్లి పబ్లిక్ స్కూల్స్‌లో సీట్లు సాధించారన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థిని డి.లిఖిత 514 ర్యాంక్ సాధించి ఎపి స్వర్ణాంధ్ర ఇంటర్నేషనల్ స్కూల్ పాలకొల్లులో సీటు సాధించిందన్నారు. జి.సుప్రియ జె.సికిలే స్కూల్లో, జి.రేణుక కేరళలోని స్టార్ట్ ఫోర్డ్ పబ్లిక్ స్కూల్, కె.హెన్నీ కేరళలోని శ్రీకష్ణ పబ్లిక్ స్కూల్, ఎం.ప్రియాంక కేరళలోని సాయి కృష్ణ పబ్లిక్ స్కూల్స్‌లో సీట్లు పొందారనానరు. గణిత ఉపాధ్యాయని జి.హేమలత పూణేలో జరిగిన చీటీఐఎస్ ఆరోవ కాన్ఫరెన్స్‌లో పాల్గొని అందరి మన్నలను పొందారన్నారు.

జాతీయ కుష్టు నిర్మూలన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ కుష్టి వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ముద్రించిన పోస్టర్‌ను కలెక్టర్ పి.ప్రశాంతి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు.ఈ నెల 18 నుంచి ఆగస్టు 2 వరకు లెప్రసి కేసు డిటెక్షన్ కాంపెయిన్, ఇంటింటా సర్వేను నిర్వహించనున్నారు. కోవిడ్ వైరస్ కారణంగా ప్రజల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గిందన్నారు. కుష్టుపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలన్నారు. వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. తొలి దశలోనే వైద్యం చేయించుకుంటే పూర్తిగా నిర్మూలించొచ్చన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని పిహెచ్‌సిలు, యుపిహెచ్‌ల వైద్యులు, సిబ్బంది సస్పెక్ట్ కేసులను గుర్తించాలన్నారు. జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఎన్.వసుంధర మాట్లాడుతూ కుష్టు సర్వే కోసం జిల్లాలో 1,308 టీములు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జెసి కె.దినేష్‌కుమార్, డిఆర్‌ఒ జి.నర్సింహులు, డిఎంహెచ్‌ఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ ఎన్.వసుంధర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన మేజర్ డ్రెయిన్ల నిర్మాణం

నగర ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్



డ్రెయినేజీలను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వాసు

నగరంలో మేజర్ డ్రెయిన్ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి అప్పారావు తెలిపారు. సోమవారం నగరంలోని 37వ డివిజన్‌లో స్థానిక నాయకులు, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 37, 36 వార్డులను అనుసంధానం చేస్తూ మేజర్ డ్రెయిన్ పనులను గత ప్రభుత్వంలో చేపట్టారన్నారు. 2018 నుంచి ఆ పనులు ముందుకు సాగట్లేదన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో జాప్యం జరిగిందన్నారు. ఈ అంశంపై సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి నెలరోజులు లోపు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామన్నారు. ఈ డ్రెయిన్ నిర్మాణం పూర్తయితే లలితానగర్, ఆదమ్మ దిబ్బ ప్రాంత ప్రజలకు మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అంతర్గత రహదారులు, శానిటేషన్, కల్వర్టులు, స్ట్రీట్ లైట్ వంటి అంశాలకు సంబంధించి నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజారోగ్య సంరక్షణే లక్ష్యంగా నగరపాలక సంస్థ వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు యు.లోకేష్, ఆశ వర్కర్స్. సచివాలయం, సచివాలయం సెక్రటరీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'స్వర్ణాంధ్ర' సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వర్ణాంధ్ర సేవా సంస్థ సేవలు అభినందనీయమని విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జితేంద్ర అన్నారు. సోమవారం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో 128 మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమానికి జితేంద్ర, సిపిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చింత ప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఇటీవల మరణించిన చింతా నాగప్రణవరెడ్డి జ్ఞాపకార్థం రూ.10 వేలను ప్రసాదరెడ్డి అందించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ 26 ఏళ్లుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థ సుమారు 1,009 ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించిందన్నారు. ఈ నెల 3న జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో గుర్తించిన 128 మందికి రూ.60 వేల విలువైన కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. 27 మందికి కంటి శాస్త్ర చికిత్సలు చేయించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర కార్యదర్శి గంగాధర్, కోశాధికారి విజయలక్ష్మి, మేనేజర్ ఎమ్‌డి.ఇలియాసుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక లాలా చెరువు ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థినులు జయనాగదుర్గాదేవి, షెకినాగ్లోరీ, స్మైలీలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందించారు. 1998-99 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఈ ప్రోత్సాహకాలను అందించామని జి.రవికృష్ణ కుమార్తె తెలిపారు. హెచ్‌ఎం ఎ.మల్లేశ్వరరావు చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందించారు. ప్రతి ఏడాదీ ఈ ప్రోత్సాహకాలు అందిస్తామని ఎతలిపారు. 1998-99 బ్యాచ్ విద్యార్థులు వి.శ్రీనివాస్, కె.రాణి, విజయలక్ష్మి, రత్నమాల, మల్లిపూడి శివాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం బెంచీల ఏర్పాటు

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికులు మస్తరు సమయంలో కూర్చొనేందుకు సంజీవని హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్టీ, రక్తదాత సరిపెల్లి రమణ బెంచీలను ఏర్పాటు చేశారు. కార్మికులు పడుతున్న ఇబ్బందులను యూనియన్ యూనియన్ గౌరవాధ్యక్షులు జువ్వల రాంబాబు ద్వారా మున్సిపల్ కార్మికులకు ఈ బెంచీలు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కార్మికులు సరిపెల్లి రమణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కార్మికుల సౌకర్యాల కోసం మున్సిపల్ కమిషనర్ కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తూరుగోపు చిరంజీవి, బొచ్చా సాయి రమణ, కాకి రాజశేఖర్, బి.కొండరమేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

సాగులో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - చాగల్లు

వర్షాల నేపథ్యంలో వరిసాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కూచిపూడి గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వివిధ దశలలో ఉన్న వరి పంట ముంపునకు గురైందన్నారు. నారు మడి మూడు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని పూర్తిగా బయటకు తీసివేయాలన్నారు. నీరు తీయడానికి వీలు లేక మొలక దెబ్బతింటే తిరిగి విత్తనం చల్లుకోవాల్సిన అవసరం ఉంటుందన్నారు. విత్తిన 7 నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నారు నీట మునిగిన 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలాచేయాలన్నారు. నష్ట నివారణకు నీటిని తీసివేసిన తరువాత 5 సెంట్ల నారు మడికి ఒక కిలో యూరియా, ఒక కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. తెగుళ్ళ బారిన పడకుండా, నీరు పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కు కున్న తరువాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం మాంకోజెబ్ కలిసిన మిశ్రమాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. పంట ఊడ్చిన వెంటనే మరియు పిలక దశలో ముంపుకు గురైనట్లైతే, నీటిని పూర్తిగా బయటకు తీసివేసి తరువాత పైపాటుగా ఎకరాకు 20 కిలోల యూరియా 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అదనంగా వేసుకోవాలన్నారు. ఈ విధంగా బూస్టర్ డోస్ వేసుకోవడం వలన మొక్క ముంపు ప్రభావం నుండి త్వరగా కోలుకుంటుందన్నారు. మొక్క కోలుకున్న తరువాత కుళ్లు తెగులు రాకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం కలిపి పిచికారీ చేయాన్నారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు

ప్రజాశక్తి-నల్లజర్ల

ఇటీవల కురిసిన వర్షాలకు అనంతపల్లి గ్రామంలో పెంకుటిల్లు కూలిపోయింది. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది గ్రామానికి చెందిన జొన్నకూటి గంగరాజు, సావిత్రిలకు చెందిన పెంకుటిల్లు పాతది కావడంతో వర్షాలకు నానిపోవడంతో కూలిపోయింది. కూలడాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ప్రాణాలు దక్కించుకున్నారు. విఆర్‌ఒ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని ఆయన తెలిపారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ముంపు

ప్రజాశక్తి - తాళ్లపూడి


గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే నేడు పొలాలు ముంపు బారిన పడుతున్నాయని కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని తిరుగుడు మెట్ట, పెద్దేవం గ్రామాల్లో ముంపునకు గురైన పొలాలను ఆయన పరిశీలించారు. ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులను ఆరా తీశారు. కొవ్వాడ పరిధిలోకి వచ్చే ప్రాంతాలను సర్వే చేయించి ఆక్రమణలు తొలగించేలా రైతులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట అన్నమరెడ్డి రమణ, సత్తిబాబు, అల్లూరి రాంబాబు, పోతుల దుర్గాప్రసాద్, ఏసు, లంక తాతారావు, రైతులు ఉన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - గోపాలపురం

సీజనల్ వ్యాధులు వ్యాప్తిని నివారించేందుకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ కె.రమేష్ సూచించారు. సోమవారం ఎంపిడిఒ సమావేశపు హాల్లో ఎంఇఒలు జి.శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని నివారించడానికి వివిధ పాఠశాలల్లో తీసుకొన్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. డయేరియా నివారణకు తీసుకొన్న చర్యలు, వివిధ పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల డాక్యుమెంటేషన్ పరిశీలించారు.కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, పాఠశాలల పరిశుభ్రత, పరిసరాలు శుభ్రంగా ఉండాలని, మల మూత్ర విసర్జన అనంతరం హ్యాండ్ వాష్ తప్పనిసరిగా చేయాలని, అనారోగ్యానికి గురైతే వెంటనే వైద్యుడిని సంప్రదించాలన్నారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారులు జి. శ్రీనివాసరావు, ఎ.మహేశ్వరరావు వ్యాధులు, జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌జి.సుబ్రహ్మణ్యం, శ్రీపాదలక్ష్మీనరసింహశాస్త్రి, సోమశేఖర్, నారాయణరావు, రామ్మోహన్‌రావు, విజయ్ కుమార్, లక్ష్మీప్రసాద్, శేషారత్నం, సంపూర్ణ, స్వరాజ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్‌కు సన్మానం

గోకవరం : గోకవరం ఎల్ఐసి బ్రాంచ్‌లో అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసి రాజమండ్రికి బదిలీ అవుతున్న ఎ.ప్రసన్నకుమార్‌కు ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ సెక్రటరీ నాగారపు నాగరాజు, సిఎం క్లబ్ మెంబర్ తలారి సూర్యప్రకాశరావు, ఈసీ మెంబర్ మెప్పెల్లి జయరాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ ప్రసన్నకుమార్ సేవలు అభినందనీయమన్నారు. చేసిన ఏడాదిలోనే గోకవరం ఎల్ఐసి బ్రాంచ్‌కు ప్రత్యేక గుర్తింపును తెచ్చారన్నారు. ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ కె.విద్యాసాగర్ ఎబిఎం ప్రసన్నకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్‌సి సిబ్బంది, ఏజెంట్స్ పాల్గొన్నారు.

ముంపునకు గురైన పొలాల పరిశీలన

గోపాలపురం : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చిట్యాల, వెంకటాయపాలెం, చెరుకుమిల్లిలో ముంపునకు గురైన పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, కొవ్వూరు ఎడిఎ పి.చంద్రశేఖరరావు, తహశీల్దార్ డి.వనజాక్షి, ఎఒ రాజారావు సోమవారం పర్యటించారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు మాట్లాడారు. ముంపు తర్వాత వరి పైరులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. 5 రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. 5 రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి పంటకు గాలి తగిలేలాచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ శ్రీనివాస్, అగ్రికల్చర్ సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

పురుషోత్తపట్న - రఘుదేవపురం రహదారికి మరమ్మతులు

సీతానగరం : శిథిలమైన పురుషోత్తపట్నం-రఘుదేవపురం ప్రధాన రహదారికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు పడి అస్తవ్యస్తంగా మారింది. ఈ విషయాన్ని టిడిపి నాయకులు ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారం చేయడానికి ఎంఎల్ఎ బత్తుల పోలవరం ప్రాజెక్ట్ పనులను చేస్తున్న మెగా ఇంజనీరింగ్ సంస్థను సంప్రదించారు. మెగా సంస్థ స్పందించి మరమ్మతు పనులను చేపట్టింది. ఎంఎల్ఎ భార్య వెంకటలక్ష్మి ఈ పనులను పర్యవేఇంచారు. ఆమె మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే నేడు ఈ దుస్థితి పట్టిందన్నారు. పనులు పూర్తి కావడానికి 4 రోజులు పడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16 నుంచి పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం

ప్రజాశక్తి - పెరవలి

సిద్ధాంతం విద్యుత్ కేంద్రం పరిధిలో దొంగరావిపాలెం ఫీడర్ ఆర్‌డిఎస్‌ఎస్ పనుల్లో భాగంగా ఈ నెల 16, 17, 18 తేదీల్లో మల్లేశ్వరం, కడింపాడు గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయము కలుగుతుందని నిడదవోలు ఇఇ బి.వీరభద్రరావు, ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకూ మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. పెరవలి సబ్ స్టేషన్ పరిధిలో తీపర్రు ఫీడర్ మరమ్మతుల కారణంగా 16న అజ్జరం కాకరపర్రు వెంకటరాయపురం తీపర్రు గ్రామాలకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ విద్యుత్ సమయం ఉదయం 4 గంటల నుండి9 గంటల వరకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు సరఫరా చేస్తారన్నారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - కిడియం

బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని కడియం సిఐ బి.తులసీధర్ హెచ్చరించారు. జేగురుపాడులో బహిరంగంగా మద్యం సేవిస్తున్న నలుగురిని సోమవారం అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. అలాగే దుళ్ల గ్రామంలో ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం మండలం జి.ఎర్రంపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడియం మండలం దుళ్లకు చెందిన గండి దుర్గారావు(37), వీరవరంలో జక్కం వెంకటేశ్వరరావు(39) మృతి చెందారు. సోమవారం వీరు బైకుపై పాత తుంగపాడులో ఉన్న దుర్గారావు పొలం చూడడానికి వెళ్లారు. మార్గమధ్యంలో ట్రక్కు ఆటో వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావును రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. వీరిద్దరూ తాపీపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. దుర్గారావుకు భార్య, ఏడాది వయస్సు గల కుమార్తె ఉన్నారు. సిసి ఫుటేజ్ ఆధారంగా పోలీసులు ఢీ కొన్న వాహనాన్ని గుర్తించారు. దీనిపై రాజానగరం ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మూడు కేసులను ఛేదించిన కాకినాడ పోలీసులు

-133 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
-జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ వెల్లడి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ సిటీ పరిధిలోని మూడు పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసులను పోలీసులు ఛేదించినట్లు ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. అలాగే కాకినాడ వన్ టౌన్ పరిధిలో జరిగిన బంగారు వస్తువుల దొంగతనం కేసును ఛేధించి సుమారు 133 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నగరంలోని రాజాజీ వీధిలో బంగారు దుకాణం నడుపుతున్న సుధీర్ కుమార్‌చౌహాన్ అనే వ్యక్తి బంగారు వస్తువులు వేరు వేరు ప్రదేశాల్లో తయారు చేయించి వాటిని కాకినాడలో విక్రయిస్తారు. గత నెల 26న రంగనాధన్న అనే వ్యక్తి బంగారు వస్తువులు తీసుకుని కోయంబత్తూరు నుంచి వచ్చారు. ఆ వస్తువుల మోడల్స్ నచ్చకపోవడంతో వాటిని తిరిగి అతనికి ఇచ్చి సామర్లకోటలో రైలు ఎక్కించటానికి 26న ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరికి వచ్చారు. అక్కడ గుర్తు తెలియన దుండగుడు ఫిర్యాదుదారుని బ్యాగును కత్తిరించి 133 గ్రాములు బంగారంను ఎంతుకుపోయాడు. దీనిపై వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టగా సోమవారం కాకినాడ దేవాలయం వీధిలో ఉన్న సహకార బ్యాంకు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న విశాఖపట్నంనకు చెందిన అరటికట్ల తారకేశ్వరరావు, కరణం సత్తి బాబులను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించారని, వారి నుంచి 133 గ్రాములు బంగారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే కాకినాడ పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 13న చిట్టిబోయిన ఉమామహేశ్వరరావు అనే వ్యక్తి కుంభాభిషేకం వద్ద చేపలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా ఒక వ్యక్తి మోటార్ సైకిల్‌ను అడ్డుగా ఆపి అతన్ని భయపెట్టి బెదిరించి రూ.30 వేలను లాక్కుని పారిపోయాడన్నారు. ఈ కేసులో ముద్దాయి అయిన తిరుపతికి చెందిన వాయిల వెంకటేశ్వర్లును అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ అరెస్టు సమయంలో తన స్కూటర్‌లో తెల్లకోటు, స్టెతస్కోప్ ఉండటంతో విచారించగా ప్రభుత్వ ఉద్యోగిగా, డాక్టర్‌గా పనిచేస్తానని చెప్పి అనేక మోసాలకు పాల్పడినట్లు అంగీకరించినట్లు వివరించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో అద్దె ప్రాతిపదికన కార్లు తీసుకుని ఆ కార్లను వేరొకరికి తాకట్టు పెడుతున్న రేచర్ల పేటకు చెందిన తెలుగు రాజేష్, వలసపాకలకు చెందిన బక్కే కిషోర్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇదే తరహాలో గతంలో అనేక మోసాలకు పాల్పడినట్లు వారు అంగీకరించడంతో వారిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి నుంచి ఏడు కారులను స్వాధీనం చేసినట్లు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. తాను ఎస్‌పిగా చేసిన సుమారు ఏడాది కాలంలో జిల్లా ప్రజల ఆదరణ పొందాననే ఆనందంతో గుంటూరు జిల్లాకు ఎస్‌పిగా బదిలీపై వెళ్తున్నాని అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి ఎంవిజె.భాస్కరరావు, డిఎస్‌పి కె.హనుమంతరావు, సిఐలు విఎల్‌వికె.సుమంత్, వి.సురేష్‌బాబు, కె.భగవాన్, ఎస్ఐలు పి.చినబాబు, ఒ.పుల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

60 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం రూరల్

ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామ శివారు మామిడి తోటలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన రూ.3 లక్షల విలువ చేసే 60 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పెద్దాపురం డిఎస్‌పి లతా కుమారి తెలిపారు. సోమవారం ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలోని ధర్మవరం శివారు హమ్మయ్య చెరువు పుంతలో నలమాటి సరస్వతయ్య తోటలోని రేకుల షెడ్డులో గంజాయిని నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారంతో ఆదివారం రాత్రి ప్రతిపాడు పోలీసులు దాడి చేసినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడైన సింహాద్రిపురానికి చెందిన మొగలి మణికంఠ పరారీలో ఉన్నాడని, మరో నిందితుడు అయిన సింహాద్రిపురానికే చెందిన కంద సూర్యనా రాయణ, ధర్మవరానికి చెందిన మూడో నిందితుడు వనం ఏసుబాబులను అదుపులోకి తీసుకున్నామన్నారు. 60 కిలోల గంజాయితోపాటు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చాకచక్యంగా గంజాయిని స్వాధీనం చేసుకున్న ప్రతిపాడు ఎస్ఐ పవన్ కుమార్, సిబ్బందిని జిల్లా ఎస్‌పి రివార్డులతో సత్కరిస్తారని తెలిపారు. ఈ సమావేశం ప్రత్తిపాడు సిఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి - తాళ్లపూడి


బాలికను వేధిస్తున్న యువకుని మందలించడంతో స్నేహితుడితో కలిసి బాలిక మేనమామపై దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తాళ్లపూడి ఎస్ఐ శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాల మేరకు వేగేశ్వరపురం గ్రామంలోని పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినిని అదే గ్రామానికి చెందిన ఉన్నమట్ల అనిల్‌కుమార్ తరచూ వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తన ఇంట్లో చెప్పింది. దీంతో బాలిక మేనమామ అనిల్ కుమార్‌ను మందలించాడు. కక్ష కట్టిన అనిల్‌కుమార్ తన స్నేహితుడు సాయికుమార్‌తో కలిసి బాలిక మేనమామ ఇంటిపై దాడి చేశాడు. ఈ దాడిలో బాలిక మేనమామ గాయపడ్డాడు. ఈ కేసులో నిందితులు అనిల్‌కుమార్, అతని స్నేహితుడు సాయికుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వేర్వేరు వృద్ధులకు ఒకటే కార్డు..

-రేషన్, పింఛను చెరిసగం
-ఆశ్చర్యం గొలుపుతున్న అధికారుల తీరు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

వారిద్దరూ వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వారు. ఇద్దరికీ ఎటువంటి బంధుత్వం కూడా లేదు. ఒకరికొకరు తెలియదు. కానీ ఇద్దరికీ ఒకే రేషన్ కార్డును ఇచ్చారు. దీంతో ప్రభుత్వం ద్వారా అందుతున్న రేషన్, పెన్షన్ సగం సగం పంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక నెల ఒకరు రేషన్ తీసుకుంటే మరుసటి నెల ఇంకొకరు తీసుకునే దుస్థితి ఏర్పడింది. అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా వీరికి ఈ కష్టం వచ్చి పడింది.



ఒకే రేషన్ కార్డులో సభ్యులుగా ఉన్న వృద్ధులు



భారతమ్మ



బుచ్చమ్మ

యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఉంటున్న వృద్ధురాలు కర్రి బుచ్చియమ్మది శెట్టి బలిజ సామాజికవర్గం. ఇదే గ్రామానికి చెందిన మరో వృద్ధురాలు చల్లా భారతమ్మది చేనేత వర్గం. గత ప్రభుత్వ హయాంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి వల్ల వీరికి తీవ్ర అన్యాయం జరిగింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో వింత పరిస్థితి వింటే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఐదేళ్ళుగా ఇదే పరిస్థితి నెలకున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్న తీరు అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. 80 ఏళ్ల పైబడిన ఆ ఇద్దరు వృద్ధులకు ఎవరికీ సమస్యలు చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఒకే రేషన్ కార్డుపై ఇద్దరికీ సరుకులు ఇస్తున్నారు. ఒకరికే పెన్షన్ ఇస్తున్నారు. ఇదేమిటి అని అధికారులను అడుగుతుంటే నోరు మెదపడం లేదు. ఒకే రేషన్ కార్డులో ఇద్దరిని నమోదు చేశారు. ప్రతి నెల ఇస్తున్న బియ్యం ఒకరి తర్వాత ఒకరు తీసుకుంటున్నాం. ఈ నెల నేను తీసుకుంటే, మరుసట నెల ఆమె తీసుకుంటున్నారని వృద్ధులు ఈ సందర్భంగా తెలిపారు. వచ్చిన పింఛను డబ్బులు సగం సగం పంచుకుంటున్నామని చెప్పారు. మాకు పిల్లలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ వాపోతున్నారు. ప్రస్తుతం లేవలేని స్థితిలో ఉన్నా గతంలో కార్యాలయాల్లో అధికారుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయాం, ఇద్దరిలో ఒకరు చనిపోతే మరొకరికి వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారని బదులిచ్చారు. కొత్త ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలుగజేసుకుని తమ సమస్యకు పరిష్కారం చూపాలని ఆ వృద్ధులు వేడుకుంటున్నారు.

'హేచరీ రంగం అభివృద్ధికి సహకరిస్తాం'

ప్రజాశక్తి - కోటనందూరు



యనమలను సత్కరిస్తున్న హేచరీస్ అసోసియేషన్ ప్రతినిధులు

హేచరీ రంగం అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందిస్తాదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం తేటగుంట టిడిపి కార్యాలయంలో ఆలిండియా షిప్ హేచరీస్ అసోసియేషన్ నూతన పాలక మండలి అధ్యక్షుడు సత్తి సూర్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదాల సతీష్, గౌరవ అధ్యక్షుడు మారుతి వెంకటేశ్వరరావు నేతృత్వంలో హేచరీస్ ప్రతినిధులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. హేచరీస్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ తీర ప్రాంత అభివృద్ధికి ఆక్వా ఆయుపట్టని, మత్స్య సంపద ఆక్వా కల్చర్ రంగాల పురోభివృద్ధికి కృషి చేస్తానన్నారు. విద్యుత్ సబ్సిడీపై ప్రభుత్వం విధాన పరమైన నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఎస్ఇజడ్‌లో పరిశ్రమల వల్ల కాలుష్యం వస్తే ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

యువత నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది పట్నాయక్

నేటి పోటీ ప్రపంచంలో రాణించాలన్నా, నిలబడాలన్నా యువతలో నైపుణ్యం అవసరమని న్యాయవాది రవి శంకర్ పట్నాయక్ అన్నారు. సోమవారం బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి, ఉపాధి అవకాశాలను కల్పించాలన్నారు. వారికి సరైన నైపుణ్యం కల్పించి వారి సామర్థ్యాన్ని సద్వినియోగపరచుకుంటే ఆ దేశం ఉన్నత స్థాయికి ఎదుగుతుందన్నారు .నేడు చదువుతున్న విద్యకు చేస్తున్న పనికి సంబంధం లేకుండా ఉందన్నారు. ప్రస్తుతం సాంకేతిక విద్య అన్ని రంగాలలో కీలకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, ఎస్.శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు, రాజా పాల్గొన్నారు.

యానాం వార్తలు



ప్రశంస పత్రం, గోల్డ్ మెడల్ అందుకుంటున్న దీప్తి

గోల్డ్ మెడల్ సాధించిన హంసాని దీప్తి

ప్రజాశక్తి - యానాం

స్థానిక కనకాల పేట గ్రామానికి చెందిన డాక్టర్ హంసాని దీప్తి మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ మైక్రోబయాలజీ విభాగంలో 2021- 2023 సంవత్సరాలకు టాపర్‌గా నిలిచి ఆర్ నంజప్పా గౌండర్ గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మేరకు సోమవారం రాత్రి చెన్నైలోని మద్రాస్ వెటర్నరీ కాలేజీ డే కార్యక్రమంలో తమిళనాడు వెటర్నరీ అండ్ యానిమల్ సైన్సెస్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ డాక్టర్.కెఎన్.సెల్వకుమార్ మద్రాస్ వెటర్నరీ కాలేజీ డీన్ డాక్టర్.ఆర్ కరుణాకరణ్, అన్నా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.ఆనందకుమార్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్, ప్రశంస పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా దీప్తికి పలువురు అభినందనలు తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి, ఇతర అధికారులు

కామరాజ్ నాడర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

మహానేత కామరాజ్ నాడర్ జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్ లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎస్‌పి రాజశేఖరన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు, కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పెద్దాపురం

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ సరిత అధ్యక్షతన లింగ నిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీలు చేసి పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ అనూషా రాయ్, డాక్టర్ నిహారిక, న్యాయవాది కందుల వెంకటచలం, వాసవి, రమణమ్మ, వీరలక్ష్మి పాల్గొన్నారు.

'బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి'

ప్రజాశక్తి - ఏలేశ్వరం రూరల్

ఎస్‌సి, ఎస్‌టి, బిసి వసతి గృహాలకు చెల్లించాల్సిన బకాయి బిల్లులను తక్షణమే చెల్లిచంఆలని పిడిఎస్‌యు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఏలేశ్వరంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కె.సతీష్, కన్వీనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వసతి గృహాలను పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వసతి గృహాలకు 8 నెలల బిల్లులు సుమారు రూ.120 కోట్లు ఉన్నాయని తెలిపారు.

ఎంఎల్ఎ పంతంను సత్కరించిన పవన్



ఎంఎల్ఎ నానాజీని సత్కరిస్తున్న డిప్యూటీ సిఎం పవన్

ప్రజాశక్తి - కరప

ఎంఎల్ఎ పంతం నానాజీని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సత్కరించారు. సోమవారం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించిన ఎంఎల్ఎలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ పంతం నానాజీని శాలువా కప్పి పూల గుచ్చం అందించి సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 274 అర్జీలు

ప్రజాశక్తి - పెద్దాపురం



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి

స్థానిక మట్టేవారి ఆర్యవైశ్య సేవా సంఘ కళ్యాణ మండపంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీ దారులు పోటెత్తారు. సోమ వారం జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందం రెడ్డి, ఆర్‌డిఒ జె.సీతా రామా రావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించాలనే లక్ష్యంతో నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుం దన్నారు. ప్రజల నుంచి భూమి సరిహద్దు సమస్యలు, ఆన్‌లైన్ నమోదు, సర్వే, పింఛన్లు, ఇండ్ల స్థలాలు, టిడ్కో గృహాలు, బీమా, సదరం సర్టిఫికెట్, మురికి కాలువలో పూడిక తీతలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రజలు తమ అర్జీలను అందించారు. తక్షణమే ఆయా శాఖల అధికారులు అర్జీలకు చట్టపరిధిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, సామర్లకోట కమిషనర్ జె.రామారావు, తహశీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరారు. సోమవారం మండలంలోని కొవ్వాడ పంచాయతీ పాలకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎపి గ్రామపంచాయతీ వర్కర్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ, కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. కొబ్బరి నూనె, సబ్బులు, బట్టలు ప్రతి సంవత్సరం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూకరాజు, రమేష్, సత్తిబాబు, లక్ష్మి, సత్యనారాయణ, శ్రీను, ప్రసాద్, పల్లారావు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ఆభరణాలు చోరీ

ప్రజాశక్తి - పెరవలి

మండలం ముక్కామల సచివాలయం పరిధి లో ముత్యాలవారిపాలెం చెందిన మారేళ్ల వెంకటేశ్వరరావు ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి 52 గ్రాముల బంగారం, వెండి వస్తువులు దొంగిలించారు. ఈ నెల 13న ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి ఉండ్రాజవరంలో కుమారుని ఇంటికి వెళ్లారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. 14న ఇంటికి వచ్చిన ఆయన చోరీకి గురైన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎజిఎస్.మూర్తి తెలిపారు.

డ్వాక్రా సిసి రమేష్‌పై విచారణ

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి క్లస్టర్‌కు చెందిన డ్వాక్రా విఒఎలు 11 మంది ఫిర్యాదు మేరకు ఖండవల్లి సిసి రమేష్‌పై సోమవారం విచారణ నిర్వహించారు. డిఆర్‌డిఎ ఆఫీస్ నుంచి వచ్చిన కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. రాజమండ్రి ఎపిఎం త్రిమూర్తులు, జెండర్ ఎపిఎం నాగలక్ష్మి, ఏరియా కో-ఆర్డినేటర్ రాజాబాబు విచారణ చేశారు. ఈ విచారణలో మండల సమాఖ్య ప్రెసిడెంట్ ఆగర్తి స్వరూపారాణి ఫిర్యాదు దారుల సమస్యలను పరిశీలించారు.

మరిడమ్మకు సారె సమర్పణ

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మకు సాయి సేవ గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం సారెను సమర్పించారు .స్థానిక శివాలయం వద్ద ఉన్న సాయిబాబా ఆలయం నుంచి సాయి సేవా కుటుంబ సభ్యులు మరిడమ్మ ఆలయం వరకు పాదయాత్రగా వెళ్లి మరిడమ్మకు చీరె, సారె సమర్పించారు.



మరిడిమ్మకు సారెను సమర్పిస్తున్న ప్రతినిధులు

నీట మునిగిన నారుమళ్ల పరిశీలన

మామిడికుదురు రూరల్ : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మామిడికుదురు, నగరం, ఈదరాడ, గెద్దాడ తదితర గ్రామాల్లో నీట మునిగిన నారుమళ్ళను సోమవారం మండల వ్యవసాయ అధికారి మృదుల సోమవారం సందర్శించారు. రెండు మూడు రోజుల వయసున్న నారు మళ్లు మూడు రోజుల కన్నా ఎక్కువ నీట నానితే మొలకశాతం తగ్గుతుందన్నారు.

హైస్కూలు విద్యార్థులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మురమళ్ళ, ఐ.పోలవరం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు సోమవారం స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ఎంఇఒలు ఎస్.కొండారెడ్డి, కె.తిరుమలరావు ఆధ్వర్యంలో ఎంపిపి మోర్త రాణి, మిరియం జ్యోతి, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు సమక్షంలో ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సోమవారం హైస్కూల్ విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక బ్యాగు, మూడు జతల యూనిఫారాలు, షూస్, సాక్సులు, బెల్టులు ఇచ్చినట్టు తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న మెనూపై ఆరా తీశారు. ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పని చేయాలని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, మద్దింశెట్టి పురుషోత్తం, లంకలపల్లి జమ్మి, సాగిరాజు సూరిబాబురాజు, దాట్ల పృథ్వీరాజు, కాకర్లపూడి రాజేష్, లంకలపల్లి బుల్లియ్య, పిన్నమరాజు శివరాజు, చెయ్యేటి శ్రీనుబాబు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచే విధంగా కృషి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని నేలటూరు మెయిన్ పాఠశాలలో స్టూడెంట్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. ఎంఇఒ కె.తాతారావు మాట్లాడుతూ 3,120 మందికి విద్యార్థులకు 3 జతల యూనిఫామ్, జత షూస్, సాక్స్, బ్యాగ్, బెల్ట్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, డిక్షనరీలతో కలిపి 7 ఐటమ్స్ 51 పాఠశాలలకు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల వీరన్న, ఎంపిటిసి సభ్యురాలు రుద్రాక్షల వీర గౌరీ కుమారి, టిడిపి అధ్యక్షుడు రుద్రాక్షల సోమేష్, జనసేన పార్టీ అధ్యక్షుడు నకాక జనార్ధన్, పాఠశాల గౌరవ సలహాదారు పుట్టా దొరబాబు, వల్లూరు పాఠశాల హెచ్ఎం ఎంవి.లక్ష్మి, కార్యదర్శి విడివి.లక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ జోగేశ్వరరావు

చెముడులంక హైస్కూలులో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - ఆలమూరు

చెముడులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నారై తిర్నాతి శ్రీహిత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఇందులో ప్రథమ బహుమతి పవన్ కుమార్, ద్వితీయ బహుమతి సూర్యప్రకాష్, తృతీయ బహుమతి రమ సాధించారు. వీరికి నగదుతో పాటు, మెడల్స్ కూడా బహూకరించి, పోటీతత్వంతోనే విద్యార్థుల్లో నైపుణ్యత వెలికి తీయవచ్చని వారు వివరించారు. శ్రీహిత్‌తో పాటు మెంటార్ స్టీవ్ గార్డినర్ పాల్గొని విద్యార్థులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. తిర్నాతి లవకేశవరావు, వంశీ, వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, హెచ్ఎం బి.శివరామకుమార్ పాల్గొన్నారు.